

మెట్‌పల్లి: పూజలో పాల్గొన్న మేజిస్ట్రేట్ అరుణ్‌కుమార్




ధర్మపురిలో మండపానికి తీసుకెళ్తున్న భారీ విగ్రహం



జగిత్యాలలో కొలువైన గణనాథుడు



రాయికల్‌లో నెమలి వాహనంపై గణనాథుడిని తీసుకెళ్తున్న యూత్ సభ్యులు



మల్యాల అంగడి బజార్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడు



పెగడపల్లిలో వినాయకుడి వద్ద భక్తుల పూజలు



వెల్గటూర్‌లో..



జగిత్యాలలో మండపానికి తరలుతున్న భారీ విగ్రహం

కొలువుదీరిన గణనాథులు..

జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్/కోరుట్ల రూరల్/ధర్మపురి/మెట్‌పల్లి/మెట్‌పల్లిరూరల్/రాయికల్/సారంగాపూర్/కథలాపూర్/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/వెల్గటూర్/పెగడపల్లి/మల్యాల: జిల్లాలో వినాయక చవితి సంబరాలు అంబరాన్నంటాయి. పట్టణాలు,మండల కేంద్రాలు, గ్రామాల్లో శనివారం గణనాథులు మంటపాల్లో కొలువుతీరారు. డప్పు చప్పుళ్లు మేళతాళాలు, చిన్నారుల కేరింతల మధ్య గణనాథులను మంటపాలకు తరలించడంతో రోడ్లన్నీ సందడిగా మారాయి. వినాయక చవితి, నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని కాలనీల్లో రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించి పండుగ శోభ సంతరించుకుంది. వివిధ రూపాల్లో అలంకరించిన మంటపాల్లో గణనాథులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కోరుట్లలో భారీ గణనాథుడి ఎదుట ఒగ్గు కళాకారుల విన్యాసం



మోరపెల్లిలో వినాయక మండపంలో భక్తుల పూజలు



కథలాపూర్ మండలం భూషణరావుపేటలో నాయకుల పూజలు



ఇబ్రహీంపట్నం కేజీబీవీలో వినాయకుడికి పూజలు చేస్తున్న విద్యార్థినులు



నర్సింహులపల్లెలో ఒకే వేదికపై ఐదు గణనాథులు

క్లుప్తంగా

క్యాంపు కార్యాలయంలో విఘ్నేశ్వరునికి విప్ పూజలు



వినాయకుడికి పూజలు చేస్తున్న విప్

ధర్మపురి: వినాయక చవితి పర్వదినం సందర్భంగా శనివారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండపాల్లో మాజీ మంత్రి కొప్పుల పూజలు



ధర్మపురిలో గణనాథునికి కొప్పుల పూజలు

ధర్మపురి: గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా ధర్మపురిలోని పలు గణేష్ మండపాల్లో ఆదివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, జైనా పీఏసీఎస్ చైర్మన్ సొల్లు నరేశ్, నాయకులు ఉన్నారు.


వెంకట్రావుపేటలో ఉచిత దంత వైద్య శిబిరం



దంతాలు పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

మేడిపల్లి: భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామపంచాయతీ ఆవరణలో ఆదివారం జీర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జగిత్యాలకు చెందిన గణేశ్ దంత వైద్యశాల సౌజన్యంతో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ 150 మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీర్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అంగడి ఆనంద్ కుమార్, తాజా మాజీ సర్పంచ్ భూమేశ్ గౌడ్, పాక్స్ చైర్మన్ కానుగంటి శ్రీనివాస్, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు బంగారు దీపక్, ఆర్‌ఐ రాజారాం, నాయకులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడికి నాయకుల శుభాకాంక్షలు



పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న సుజిత్‌రావు

మెట్‌పల్లి: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కోరుట్ల నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో కలిశారు. పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావుతో పాటు చెర్లపల్లి ఆనంద్‌గౌడ్, పూదరి రాము, దొంతుల సుధాకర్ తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా ఆదివారం రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ వినోద్, గంగాధర్, శ్రీనివాస్, ఉదయ్, శివకుమార్, దీపిక, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు అందజేత

కథలాపూర్: మండలంలోని ఊట్‌పెల్లి వాలీబాల్ క్రీడాకారులకు ఎస్సై నవీన్‌కుమార్ ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన క్రీడాకారులను ప్రోత్సహించాలని తమ వంతుగా స్పోర్ట్స్ డ్రెస్సులు అందించామని ఎస్సై పేర్కొన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ పురుషోత్తం, కార్యదర్శి మురళి, డైరెక్టర్ చిన్ననర్సయ్య పాల్గొన్నారు.

గల్లీ చిన్నగా.. గణనాథుడు పెద్దగా.!

- వినాయక విగ్రహాల తరలింపుతో సామాన్యులకు తిప్పలు
- గంటల తరబడి నిలిచిన కరెంట్
- విగ్రహాల ఎత్తుపై నియంత్రణ కరువు

కోరుట్ల: 'మెట్‌పల్లి పట్టణంలోని రాంనగర్‌లో ఓ భారీ వినాయక విగ్రహాన్ని తరలించే క్రమంలో సందుల్లోని విద్యుత్, కేబుల్ వైర్లు అడ్డు ఉండటంతో సుమారు గంటన్నర సేపు విద్యుత్ సరఫరా నిలిపేయడం స్థానికులకు ఇబ్బంది కలిగించింది'.

కోరుట్ల పట్టణంలోని పోచమ్మవాడ, భీమునిదుబ్బ ఏరియాల్లో సుమారు 20 ఫీట్ల ఎత్తున్న విగ్రహాలు నెలకొల్పడంతో కేవలం కిలోమీటర్ దూరం తరలింపు కోసం ఆరు గంటల సమయం పట్టింది. అంతే కాదు..అక్కడక్కడ అడ్డుగా ఉన్న విద్యుత్, కేబుల్ వైర్లు తెగిపోయి ప్రమాదకరంగా మారాయి.

జగిత్యాల జిల్లా కేంద్రంలోని గంజ్‌రోడ్, టవర్ సర్కిల్, విద్యానగర్, కృష్ణానగర్ ఏరియాల్లోనూ చిన్నచిన్న గల్లీల్లోకి భారీ విగ్రహాలు తరలించడం సమస్యగా మారింది. తరచూ కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగి జనం ఇబ్బందులు పడ్డారు.

ఇదీ పరిస్థితి..

పట్టణాలు, పల్లెల్లో చిన్న చిన్న గల్లీల్లో భారీ వినాయక విగ్రహాలు నెలకొల్పుతున్న క్రమంలో ఏర్పడుతున్న సమస్య. వినాయక చవితి ఉత్సవాలు అంటే అందరికి ఇష్టమే. ఆ గణనాథుడు తమ గల్లీల్లోకి తరలివస్తుంటే ఎనలేని భక్తి, విశ్వాసాలతో కాలనీల్లో ఉన్న మహిళలు పెద్ద ఎత్తున మంగళ హారతులతో స్వాగతం పలకడం సహజం. చిన్నపెద్దా, ముసలి..ముతకా..యువత పెద్ద ఎత్తున వినాయక నవరాత్రోత్సవాల్లో పాలుపంచుకుని గణనాథుడి ఆశీస్సుల కోసం తాపత్రయపడటం ఆనవాయితీ. ప్రతీ ఏటా వినాయక చవితి సందర్భంగా చిన్నచిన్న గల్లీల్లో పెద్ద ఎత్తున భారీ విగ్రహాలు ప్రతిష్ఠించడం, వాటి తరలింపులో కరెంట్, కేబుల్ తీగలు తెగిపడటం మళ్లీ వాటిని సరిదిద్దడానికి తిప్పలు పడటం, ఒక్కోసారి ప్రమాదాలు చోటు చేసుకోవడం సమస్యగా మారింది.

నియంత్రణ కరువు..

వినాయక విగ్రహాల తయారీపై నియంత్రణ కరువైన ఫలితంగానే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పరిసరాల్లో తయారవుతున్న వినాయక విగ్రహాల ఎత్తుపై పరిమితులు గమనార్హం. వినాయక విగ్రహాల తయారీదారులు అడ్డగోలుగా భారీ సైజు ఉన్న విగ్రహాలను తయారు చేస్తున్నారు. జిల్లాలో కొన్ని విగ్రహాల సైజు 20 నుంచి 25 ఫీట్ల మేర ఎత్తు ఉంటున్నాయి. ఇలా ఎత్తు ఎక్కువగా ఉన్న విగ్రహాలు ప్రతిష్ఠ, నిమజ్జనం సందర్భాల్లో నానా తిప్పలు పడుతున్నాయి. జగిత్యాల, మెట్‌పల్లిల్లోనూ గతంలో భారీ వినాయక విగ్రహాల తరలింపు సందర్భంగా చిన్నపాటి ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

ట్రాన్స్‌కో.. పోలీస్ సిబ్బందికి తిప్పలు

చిన్నచిన్న గల్లీల్లోకి భారీ వినాయక విగ్రహాలను తరలించే క్రమంలో చాలా చోట్ల విద్యుత్ వైర్లు తెగిపోవడం, కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగిందని కోరుట్ల ట్రాన్స్‌కో ఏడీఈ అంజన్‌రావు తెలిపారు. ఈ సమస్యలు సరిదిద్దడానికి తమ సిబ్బంది పూర్తి స్థాయిలో శనివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు పనిచేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోరుట్ల పరిధిలోని ఎఖీన్‌పూర్‌లో వినాయక విగ్రహం తరలింపు కోసం ఏకంగా ఆరుగంటలు కరెంట్ సరఫరా నిలిపేయడంతో గ్రామస్తులు నానా తిప్పలు పడ్డారు. కోరుట్లలోని పోచమ్మ గల్లీ, కటికెవాడ, జగిత్యాలలోని టవర్ సర్కిల్, కృష్ణానగర్, గంజ్‌రోడ్‌లోనూ విద్యుత్ సరాఫరా నిలిచిపోయి జనం చాలా ఇబ్బంది పడ్డారు.



కోరుట్లలోని ఓ వీధిలో గణనాథుని తరలింపు

మట్టి గణపతులు పంపిణీ



మట్టి గణపతులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, కమిషనర్ తిరుపతి

కోరుట్ల: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో వినాయక చవితి సందర్భంగా శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ బట్టు తిరుపతి మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే వాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం

ధర్మపురి:మండలంలోని నేరెల్ల గ్రామానికి చెందిన బద్ది గంగాధర్ గత కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. బాధితుడికి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఆదివారం 11,500 రూ.ల ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక సాయం అందించిన సభ్యులకు గంగాధర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మిత్రబృందం సభ్యులున్నారు.

కోతుల దాడిలో యువకుడికి తీవ్రగాయాలు

కథలాపూర్: మండలకేంద్రంలోని తుర్కాషి వాడలో సందీప్ అనే యువకుడిపై కోతులు దాడిచేసి గాయపరిచినట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. సందీప్ తన ఇంట్లో ఉండగా.. కోతులు వచ్చి దాడి చేసి చేతిపై కాలిపై దాడి చేసి గాయపరిచినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డీజే సౌండ్ బాక్సులు సీజ్

మెట్‌పల్లి: వినాయక విగ్రహాల తరలింపు సందర్భంగా పలు చోట్ల నిబంధనలకు విరుద్ధంగా వినియోగించిన డీజే సౌండ్ బాక్సులను సీజ్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వెల్లుల్ల, వేంపేటలతో పాటు మెట్‌పల్లి పట్టణంలో మొత్తం నాలుగు డీజే బాక్సులను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న డీజే బాక్సులను వినియోగించవద్దని మండపాల నిర్వాహకులకు సూచించామన్నారు.

నేడు దుబ్బరాజన్న ఆలయంలో హుండీ లెక్కింపు

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ఆలయ ఆవరణలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కోస్న కాంతారెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొంటారని తెలిపారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

రాయికల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల్లో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు మచ్చశేఖర్,ప్రధానకార్యదర్శి కడకుంట్ల నరేశ్, కోశాధికారి కట్ల నర్సయ్య ఆదివారం తెలిపారు. మండల ,పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గల్ఫ్ బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో గల్ఫ్ బాధిత కుటుంబానికి ఆదివారం గ్రామస్తులు రూ.31,750ల ఆర్థిక సాయంతో పాటు 50కిలోల బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కలాలి ధర్మరాజు గల్ఫ్ దేశానికి వలస వెళ్లగా, అతని భార్య నవీన అనారోగ్యంతో మృతి చెందింది. భార్య అంత్యక్రియలకు కూడా ధర్మరాజు రాలేకపోయాడు. దీంతో గ్రామస్తులు కుటుంబానికి సాయం చేశారు. ప్రభుత్వం పిల్లలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మిట్టపెల్లి జలపతిరెడ్డి, అచ్చ మురళి, డీలర్ జలంధర్, నిగ రాజేశ్, పోతు శేఖర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు సత్కారం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన కొత్తూరి శివకుమార్, సిర్లవంచ భాను, సుంకరి సుదర్శన్, గుండెల సంజీవ్,పుప్పాల రాము అనే ఐదుగురు ప్రభుత్వ ఉద్యోగులను గ్రామస్తులు ఆదివారం శాలువతో సత్కరించారు. తమ గ్రామానికి చెందిన ఐదుగురు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ,రాబోయే తరాల యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఇందులో నలుగురు ఇటీవలే పదోన్నతి పొందినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పీసు తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా శ్రీకర్



శ్రీకర్



శంకరయ్య

రాయికల్: పట్టణ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగమల్ల శ్రీకర్, ఉపాధ్యక్షుడిగా మచ్చ శేఖర్, ప్రధాన కార్యదర్శిగా సింగిడి శంకరయ్య, కోశాధికారిగా గుర్రాల వేణు,సంయుక్త కార్యదర్శిగా నాగిరెడ్డి రఘుపతి,కార్యవర్గ సభ్యులుగా బొమ్మకంటి వెంకటరమణ, పటేల్ నరేందర్ రెడ్డి, బొంగోని శ్రీనివాస్ గౌడ్, వాసరి రవి యాదవ్, వాసం లింబాద్రి, ఎనుగంటి రవి లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకర్ మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ అభివృద్ధి,పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి: ప్రోగ్రెసివ్ రికగ్నైస్డ్ టీచర్స్ యూనియన్ మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా దగ్గుల గంగాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కావలి బాలకిషన్, ఉపాధ్యక్షులుగా నాగుల జయలక్ష్మీ, నడిమెట్ల రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడిగా గద్దె సత్యనారాయణ, కార్యదర్శులుగా మార్గం రాజేందర్, భావనలను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి బొమ్మన చిన్నయ్య తెలిపారు.

'పీసీసీ అధ్యక్ష పదవి మధుయాష్కికి ఇవ్వకపోవడం దారుణం'

కథలాపూర్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, నిజామాబాద్ మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వకపోవడం దారుణమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం కథలాపూర్‌లో మాట్లాడారు. ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీకి సన్నిహితుడైన మధుయాష్కికి పీసీసీ అధ్యక్షపదవి ఇవ్వకపోవడం పట్ల మరోసారి అగ్రకులాల పెత్తనం చెలామణి అవుతుందని నిరూపితమైందని మండిపడ్డారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం పునరాలోచించాలని.. లేకపోతే పార్టీకి కష్టపడిన కార్యకర్తలు నిరాశకు గురయ్యే అవకాశముందన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్లో 10 వతరగతి చదువుకున్న 2006–07 సంవత్సరం పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయసమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి పీఈటీ గంగాధర్, గణిత ఉపాధ్యాయుడు రామచంద్రం, భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు రామకృష్ణలను సన్మానించారు.